


**హైదరాబాద్‌ను యూటీగా మార్చేందుకు కుట్రలు : హరీశ్‌రావు**


# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd





**కవిత బెయిల్ పిటీషన్ విచారణ వాయిదా...**


Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 147 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 25 మే 2024


## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఈసీ అనుమతి...



**హైదరాబాద్, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ వేడుకలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించింది. జూన్ 2న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో అవతరణ వేడుకలను నిర్వహించనున్నారు. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్ పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. అవతరణ వేడుకలకు ఈసీ నుంచి అనుమతి లభించిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జూన్ 2న నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖలను ఆదేశించారు.సీఎం ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తారన్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాలను కేటాయించేటప్పుడు ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు.

## లాలూ కూటమి వస్తే మళ్లీ 'జంగిల్ రాజ్': అమిత్ షా



**అరాహ్,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆర్‌జెడి చీఫ్ వెనుకబడిన తరగతుల (ఒబిసిల) సంక్షేమం కోసం గాని, తన కులం 'యాదవ్'కు చెందినవారి సంక్షేమం కోసం గాని పాటుపడలేదని అమిత్ షా ఆరోపించారు. అరాహ్‌లో బిజెపి సీనియర్ నేత, కేంద్ర మంత్రి ఆర్‌కె సింగ్‌కు మద్దతు కోసం ఒక ఎన్నికల ర్యాలీలో అమిత్ షా ప్రసంగిస్తూ, 'మొండితనం ఉన్న' ఇండియా కూటమిలో భాగమైన లాలూ ప్రసాద్ అధికారంలోకి వస్తే 'బీహార్‌కు జంగిల్ రాజ్, అపహరణ, ముఠా యుద్ధం తిరిగి వస్తాయి' అని ఆరోపించారు. 'బీహార్‌లో జంగిల్ రాజ్, ముఠా పోరు, అపహరణ పరిశ్రమ పునరాగమనాన్ని జనం కోరుకోవడం లేదు. లాలూ బిసిల సంక్షేమం కోసం గాని, తన సొంత కులం 'యాదవ్'కు చెందినవారి కోసం గాని కృషి చేయలేదు. తమ కోసం లాలూ పాటుపడతారనే దురభిప్రాయంతో వారు ఉన్నారు' అని అమిత్ షా పేర్కొన్నారు.'లాలూజీ తన ఇద్దరు కుమారులను మంత్రులను కానిచ్చారు, ఒక కుమార్తెను

వివరాలు 2లో




## తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరు..

## - రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

**భువనగిరి,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గడిచిన ఆరు నెలల్లో లక్షన్నర పెండ్లిలు జరిగాయని, ఆడ బిడ్డలకు రేవంత్ రెడ్డి లక్షన్నర తులాల బంగారం బాకీ ఉన్నారని చెప్పారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని 420 రేవంత్ రెడ్డి అని ధ్వజమెత్తారు.ఆరు గ్యారెంటీల్లో ఒక్క హామీ అమలు చేసి, ఐదు చేసినట్లు ప్రగల్భాలు పలుకుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఫ్రీ బస్సుల్లో సీట్ల కోసం మహిళలు, టికెట్ల కోసం పురుషులు కొట్లాడుకుంటున్నారని చెప్పారు. డిసెంబర్ 9న రుణమాఫీ ఫైల్‌పై సంతకం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు రుణమాఫీ ఊసేలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో దొడ్డు బియ్యానికి బోనస్ అని చెప్పి, ప్రభుత్వం ఏర్పడ్డాక సన్న వడ్లకే అని మాట మార్చారని మండిపడ్డారు. 95శాతం రైతులు దొడ్డు వడ్లు పండిస్తారని, సన్న బియ్యానికే బోనస్ అని బోగస్ మాటలు చెబుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఇప్పటిదాకా ఒక్క నోటిఫికేషన్ కూడా వేయలేదన్నారు. రేవంత్ రెడ్డి లాంటి ఇంద్రజాలికుడిని ఎక్కడా చూడలేదన్నారు. నోటిఫికేషన్లు లేవు, రాత పరీక్షలు లేవని, కానీ 30వేల ఉద్యోగాలు ఇచ్చామని దొంగ మాటలు చెబుతున్నారని విమర్శించారు.లంకె బిందెలు ఉన్నాయనుకుంటే ఖాళీ కుండలు ఉన్నాయని సీఎం అంటున్నారని, లంకె బిందెలు కావాలని దొంగలే తిరుగుతారని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు నాయకుడు

వివరాలు 2లో

## బిజెపికి 400కు పైగా సీట్లు ఎట్లా వస్తాయి? : ఖర్గే




**హైదరాబాద్, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి చోట ఓడుతున్న బిజెపి పార్టీకి 400కు పైగా సీట్లు ఎలా వస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ఇండియా బ్లాక్ కు మెజారిటీ రాబోతోందని ఆయన అన్నారు. తన హెూంటౌన్ కలబురగిలో ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఇండియా కూటమికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని అన్నారు.ఇది ప్రధాని నరేంద్ర మోడీ, ప్రజలకు మధ్య జరుగుతున్న ఎన్నికలని ఆయన అన్నారు. ఎందుకంటే దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. పైగా భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై పెద్ద దాడి జరుగనున్నదని ఆయన హెచ్చరించారు. బిజెపి రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేసి పాలిస్తోందన్నారు. అందుకనే ప్రజలు ఇండియా కూటమిని గెలిపించి బిజెపికి షాక్ ఇవ్వబోతున్నారని అన్నారు. అందుకనే ఇండియా కూటమి సానుకూలతలు ఎక్కువ ఉన్నాయన్నారు. బిజెపి తిరిగి అధికారంలోకి రాకుండా ఆపగలిగే సామర్థ్యం ఇండియా కూటమికే ఉందన్నారు. జూన్ 4 వరకు ప్రజలు ఆగాలని ఆయన అన్నారు. ఎన్నికల ఫలితాల ఆధారంగానే తమ తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. తన లెక్క(అంచనా) ప్రకారం బిజెపి ప్రతి రాష్ట్రంలో ఓడుతోందన్నారు. ఈసారి కాంగ్రెస్ సీట్లు పెరుగుతాయని కూడా ఆయన తెలిపారు. ఇండియా బ్లాక్‌కు ఎక్కువ సీట్లు రాబోతున్నాయన్న సూచనలు కనిపిస్తున్నాయని ఆయన చెప్పారు.

## విరిగిపడిన కొండచరియలు: 100 మంది మృతి



**పపువా న్యూ గినియా,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొండచరియలు విరిగిపడడంతో వంద మంది మృతి చెందిన సంఘటన పపువా న్యూ గినియా దేశం ఎన్గా ప్రావిన్స్‌లో జరిగింది. కావోకలం గ్రామంలో కొండచరియలు విరిగిపడడడంతో 100 మందికి పైగా గ్రామస్థులు దుర్మరణం చెందారు. సంఘటన పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్‌కు వాయువ్య దిశకు 600 కిలో మీటర్ల దూరంలో జరిగింది. భారీగా కొండ చరియలు విరిగిపడడంతో వందల ఇండ్లు కూలిపోయాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా వెల్లడించింది. రెస్క్యూ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఆ గ్రామంలో బంగారు గనులు ఉన్నాయి. అధికారికంగా ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు.


## ముఖ్యమంత్రిగా రాజీనామా చేసే ప్రసక్తి లేదు: అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకునే ప్రసక్తి లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పునరుద్ఘాటించారు. జైలు నుంచే ప్రభుత్వాన్ని నడపగలనని ప్రధాని నరేంద్ర మోడీకి చూపుతానని ఆయన చెప్పారు. శుక్రవారం ఇండియా టుడే టివికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తాను పదవికి రాజీనామా చేస్తే దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని చెప్పారు. ఇదే నరేంద్ర మోడీ కూడా కోరుకుటున్నారని ఆయన అన్నారు. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను ఓడించలేనని తెలిసే ఈ పథకానికి మోడీ వ్యూహరచన చేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే ప్రభుత్వం పడిపోతుందని, అప్పుడు ఎన్నికలు నిర్వహించి గెలుపొందాలని ప్రధాని భావించారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తాను రాజీనామా చేస్తే తదుపరి టార్గెట్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అవుతారని ఆయన ఆరోపించారు.ఢిల్లీ మురికివాడలలో పనిచేసేందుకు ఆదాయం పన్ను శాఖలో మేనేజర్ ఉద్యోగం మానేశానని, గతంలో 49 రోజుల పాటు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశానని, కాని తన పోరాటంలో భాగంగా ముఖ్యమమంత్రి పదవికి మాత్రం రాజీనామా చేసే ప్రసక్తి లేదని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. తన రాజీనామా కోసం బిజెపి పిల్ కూడా దాఖలు చేసిందని, అయితే సుప్రీంకోర్టు రాజీనామా చేయమని ఆయనపై(కేజ్రీవాల్) ఒత్తిడి చేయలేమని స్పష్టం చేసిందని ఆయన వివరించారు. జైలు నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగితే తనకు జైలులో తనకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికల తర్వాత బిజెపి ఓటమి చెందిన రాష్ట్రాలలోని బిజెపియేతర ప్రభుత్వాల ముఖ్యమంత్రులను అరెస్టు చేయడం మోడీ ప్రారంభిస్తారని, అందుకే ఆయన తనఅరెస్టు తర్వాత వెంటనే ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను అరెస్టు చేయడానికి ప్రయత్నించలేదని కేజ్రీవాల్ ఆరోపించారు.



## గ్లోబల్ సిటీస్‌లో హైదరాబాద్‌కి గుర్తింపు

**హైదరాబాద్, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంతో పాటు అంతర్జాతీయంగా హైదరాబాద్ ఖ్యాతి రోజు రోజుకు పెరుగుతోంది. ఐటి, ఫార్మా రంగాలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి పరిస్థితులు హైదరాబాద్‌ని మరింత విశిష్టంగా మారుస్తున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా 'ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ 2024' పేరుతో విడుదల చేసిన నివేదికలో హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరాల జాబితాలో చోటు సంపాదించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 564వ స్థానంలో ఉంది.గ్లోబల్ సిటీస్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచంలోని అగ్ర నగరాల జాబితాలో ఢిల్లీ గ్లోబల్ ర్యాంక్ 350 సాధించింది. ఇండియాలో తొలిస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా, ఈ జాబితాలో న్యూయార్క్ అగ్రస్థానంలో ఉంది. స్వతంత్ర ఆర్థిక సలహా సంస్థ ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ర్యాంక్ ఇచ్చిన భారతదేశంలోని టాప్-10 నగరాల జాబితాలో హైదరాబాద్ 9వ స్థానంలో నిలిచింది. ఎకనామిక్స్, హ్యూమన్ క్యాపిటల్, జీవన నాణ్యత, పర్యావరణం, పాలన అనే నాలుగు అంశాల ఆధారంగా ర్యాంకింగ్స్ రూపొందించబడ్డాయి. నాలుగు ఇండెక్స్‌లో హైదరాబాద్ ఎకనామిక్స్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచింది.



## 50 మంది నకిలీ డాక్టర్లు పట్టివేత



# కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా...

- విచారణకు సమయం కావాలన్న సిబిఐ
- 27న కౌంటర్ దాఖలు చేస్తామని వెల్లడి
- ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసిన ఈడీ
- సోమవారం వాదనలు వింటామన్నఢిల్లీ హైకోర్టు

**హైదరాబాద్,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ లిక్కర్ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై శుక్రవారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ బెయిల్ పిటిషన్లపై ఈడీ కౌంటర్ దాఖలు చేసింది. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈడీ తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. మరోవైపు సీబీఐ కేసులో బెయిల్ పిటిషన్లపై ఈ నెల 27న కౌంటర్ దాఖలు చేస్తామని సీబీఐ తెలిపింది. జూన్ 7న ఛార్జిషీటు దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు.

### వాదనలు సోమవారానికి వాయిదా

ఈడీ కేసులో, కవిత బెయిల్ పిటిషన్‌పై వాదనలను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఆదివారం సాయంత్రం లోపు కౌంటర్‌కు సంబంధించిన వివరాలు కవిత న్యాయవాదికి ఇవ్వాలని హైకోర్టు ఈడీని ఆదేశించింది. అనంతరం వాదనలను సోమవారానికి వాయిదా వేసింది.ఇదిలా ఉండగా ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు బెయిల్ నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కవిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు ఢిల్లీ లిక్కర్ పాలసీ ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొంటూ ట్రయల్ కోర్టు బెయిల్ నిరాకరించింది. మార్చి 16న లిక్కర్ పాలసీ ఈడీ కేసులో, ఏప్రిల్ 11న సీబీఐ కేసులో కవిత అరెస్టయిన సంగతి తెలిసిందే.కవిత ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలులో ఉన్నారు. పీఎంఎల్ఏ సెక్షన్–19 ప్రకారం కవిత అరెస్ట్ చట్ట విరుద్ధమని, ఆమె రూ.100




కోట్లు చెల్లించినట్లు ఎక్కడా ఆధారాలు లేవని ఆమె తరపు న్యాయవాది కోర్టులో గట్టిగా వాదించారు. ఈ మేరకు ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని ఈడీ, సీబీఐలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. దీనిపై విచారణ సోమవారం నాడు జరగనుంది.

# కేసులకు బెదిరేది లేదు.. సీఎం రేవంత్‌కు కొణతం దిలీప్ స్ట్రాంగ్ వార్నింగ్

**హైదరాబాద్,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా నమోదు చేస్తున్న కేసులకు బెదిరేది లేదు అని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నకిలీ వార్తల వెనుకాల ఉన్న వారి భరతం పట్టుడు ఖాయమని హెచ్చరించారు. నిన్న, నేడు, రేపు తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసమే పనిచేస్తాను అని మరోసారి గుర్తుచేస్తున్నానని దిలీప్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్టీసీ లోగో వివాదంపై కొణతం దిలీప్ ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు.రేవంత్ రెడ్డి ప్రోద్భలంతో నిన్న తెలంగాణ ప్రభుత్వం నామీద ఒక తప్పుడు కేసు పెట్టిన విషయం మీకు ఈపాటికే తెలిసి ఉంటుంది. ఆ కేసు పూర్వాపరాలు మీకు తెలిసి ఉండాలని ఈ నాలుగు మాటలు రాస్తున్నాను.గత కొన్ని రోజులుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంతకు ముందున్న కేసీఆర్ ప్రభుత్వం ఆనవాలు తుడిచేస్తామంటూ వివిధ సంస్థల పేర్లు మార్చే పనికిమాలిన పని ఒకటి పెట్టుకున్నది. దీన్లో భాగంగానే టీఎస్ఆర్టీసీ సంస్థ పేరును టీజీఎస్ ఆర్టీసీగా మార్చింది. రెండు రోజుల క్రితం రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక వాట్సాప్ గ్రూపులో ఆర్టీసీ కొత్త లోగో అంటూ ఒక ఇమేజ్ పంపారు. దాన్ని మే 22వ తారీకు నాడు అనేక మీడియా సంస్థలు ప్రచురించాయి. మీడియా గ్రూపుల్లో ఉన్న జర్నలిస్టు మిత్రుల నుండి కూడా ఈ విషయం




రూఢి చేసుకున్నాను. ఆ లోగోలో ఇదివరకు పాత ఆర్టీసీ లోగోలో ఉన్న చార్మినార్, కాకతీయ తోరణం లేకపోవడం గురించి విమర్శిస్తూ నేను సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టాను.ఒకరోజు తరువాత ఆర్టీసీ ఉన్నతాధికారులు నన్ను సంప్రదించి తాము ఇంకా కొత్త లోగో ఖరారు చేయలేదు అని వివరణ ఇచ్చారు. అప్పుడు నేను నా సోషల్ మీడియా పోస్టులు తొలగించాను. కానీ నిన్న సాయంత్రానికి రేవంత్ సర్కార్ నా మీద, మిత్రుడు హరీష్ రెడ్డి మీద ఒక తప్పుడు కేసు పెట్టింది. మేమే ఆర్టీసీ నకిలీ లోగోను తయారు చేశాం అని మా మీద నిస్సిగ్గుగా ఒక ఆరోపణచేసి, వివిధ సెక్షన్ల మీద మా మీద కేసులు పెట్టింది. ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్టు అసలు ఈ లోగోను రిలీజ్ చేసింది వారే. ఇప్పుడు అది బ్యాక్ ఫైర్ అయ్యేసరికి మాలాంటి వాళ్ల మీద కేసులు పెడుతున్నారు. గమ్మత్తేమిటంటే మొన్న ఈ లోగోను అనేక మీడియా సంస్థలు ప్రచురిస్తే, వారెవరి మీదా కేసులు లేవు. ఇలా ప్రచురించిన మీడియా సంస్థల్లో ముందు వరుసలో కాంగ్రెస్ అనుకూల మీడియా సంస్థలు ఎన్‌టీవీ, వీ6, బిగ్ టీవీ ఉన్నాయి. కానీ ఎన్‌టీవీ తమ సోషల్ మీడియాలో షేర్ చేసిన లోగోను నేను షేర్ చేస్తే నా మీద మాత్రం అక్రమ కేసులు పెట్టారు! తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సుమారు పదేళ్లు రాష్ట్ర డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా నిబద్ధతతో పనిచేశాను. ఫేక్ న్యూస్ వ్యాప్తిని నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను నెలకొల్పి వేలాది ఫేక్ న్యూస్‌కు అడ్డుకట్ట వేశాను. అలాంటి నా మీదనే ఇంత అన్యాయంగా, ఒక తప్పుడు కేసు పెట్టారంటే "ప్రజా పాలన" ముసుగులో గద్దెనెక్కిన ఈ కాంగ్రెస్ పాలన ఎట్లా సాగుతున్నదో మీ ఊహకే వదిలేస్తున్నా. ఇలాంటి కేసులు ఎన్నిపెట్టినా బెదిరేది లేదు. న్యాయస్థానాల మీద నాకు పూర్తి నమ్మకం ఉన్నది. దీనివెనుక ఉన్న అసలు దోషులెవరో వారి భరతం పట్టుడు ఖాయం. నిన్న, నేడు, రేపు తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసమే పనిచేస్తాను అని మరోసారి గుర్తుచేస్తున్నానని దిలీప్ పేర్కొన్నారు.

# హైదరాబాద్‌ను యూటీగా మార్చేందుకు కుట్రలు : హరీశ్‌రావు




**హైదరాబాద్,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. యూటీ చేస్తే మన హైదరాబాద్ మనకు దక్కదని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లేని తెలంగాణ.. తల లేని మొండెంలాంటిదని అభిప్రాయపడ్డారు. మధిర నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో.. ప్రశ్నించే గొంతుకనే గెలిపించాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అందర్నీ మోసం చేసిందని.. ఆరు నెలల్లోనే నిజస్వరూపం బయటపడిందని హరీశ్‌రావు అన్నారు. ఆరు నెలలు అయినా ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. నిరుద్యోగ భృతి విషయంలో చేతులెత్తేశారని అన్నారు. నిరుద్యోగ భృతి గురించి అడిగితే మేం హామీనే ఇవ్వలేదని కాంగ్రెస్ అంటుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీళ్లు, కరెంట్ మాయమయ్యాయని.. కేసీఆర్ కిట్లు బంద్ అయ్యాయని హరీశ్‌రావు అన్నారు. ఇంకెన్ని రోజులు కేసీఆర్‌ను తిట్టుకుంటూ కాంగ్రెస్ నేతలు బతుకుతారని మండిపడ్డారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓడిస్తేనే కాంగ్రెస్‌కు కనువిప్పు కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయడం అంటే.. కాంగ్రెస్ అబద్ధాలను ఆమోదించడమే అని స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను ఏపీకి బీజేపీ అప్పగించిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌ను యూటీ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం



**హైదరాబాద్,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. ఆమనగల్లు మండల శివారులో ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు హైదరాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆమనగల్ మండలం రాంనుంతల సమీపంలో శుక్రవారం ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నివాసం ఉంటున్న శివకృష్ణ వరప్రసాద్ గౌడ్ (35), మెగావత్ నిఖిల్ (26), బుర్రా మణిదీప్ (25) లను మృతులుగా గుర్తించారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కారులోంచి మృతదేహాలను వెలికితీశారు.

# శ్రీధర్ రెడ్డి హత్యపై సిబిఐ లేదా జ్యుడీషియల్ విచారణకు సిద్దం:మంత్రి జూపల్లి

**చిన్నంబావి,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో గురువారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్త శ్రీధర్ రెడ్డి హత్య కేసుపై సిబిఐ లేదా జ్యుడీషియల్ విచారణకు తాను సిద్ధమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. హత్యలను రాజకీయాలతో ముడిపెట్టి మాట్లాడటం సరికాదని హితవు పలికారు. శ్రీధర్ రెడ్డికి ఆయన కుటుంబంతోనే తగాదాలు ఉన్నాయని, హత్య ఘటనలో ఎవరి ప్రమేయం ఉందో పోలీసులు తేలుస్తారన్నారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారన్న మంత్రి ఈ ఆరోపణలు చేసినందుకు కేటీఆర్, ప్రవీణ్ తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో జూపల్లి మాట్లాడుతూ తాను బిఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి తనపై కక్ష గట్టి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాని, అవగాహన లేకుండా వారు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.'శ్రీధర్ రెడ్డికి రాజకీయాలతో సంబంధం లేదని, అతడి వల్ల ఆ ప్రాంతంలో చాలా కుటుంబాలు బాధపడ్డాయని తెలిపారు. మృతుడి కుటుంబంలో ఆస్తి తగాదాలు ఉన్నాయన్న మంత్రి జూపల్లి ఈ హత్య ఘటనపై పూర్తి విచారణ చేయిస్తామని పేర్కొన్నారు. గతంలో తమ కార్యకర్తలు చనిపోతే తాను ఇలా ఆరోపణలు చేయలేదని గుర్తు చేశారు. గంద్రపల్లి, లక్ష్మీపల్లిలో రెండు హత్యలపై వాస్తవాలు ప్రజలే చెబుతారని స్పష్టం చేశారు. కెటిఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లక్ష్మీపల్లికి రావాలని జూపల్లి సవాల్ విసిరారు. బిఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాలు చేయడం దురదృష్టకరమన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, తనను బిఆర్ఎస్ పార్టీ నుంచి బర్తరఫ్ చేసినందుకు, ప్రజలు వాళ్లను అధికారంలో నుంచి బర్తరఫ్ చేశారని జూపల్లి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడే అంశాలు లేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.కేటీఆర్ ఓ యువరాజు అని, మొన్నటి వరకు కేసీఆర్ ని తిట్టని తిట్టు తిట్టిన ఆర్ఎస్పి ఇప్పుడు కెసిఆర్ పంచన చేరారని ధ్వజమెత్తారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో భూముల వివాదం ఉందని, అన్నదమ్ముల పంచాయతీకి తనకేం సంబంధం లేదని మంత్రి జూపల్లి ఖండించారు. ఎఫ్ఐఆర్ కాపీలను ఆర్ఎస్పి, కెటిఆర్‌కు పంపిస్తానని అన్నారు. బట్టకాల్చి మీద వేస్తాం అంటే ఏం రాజకీయం చేస్తున్నట్టు అని ఆయన గట్టిగా నిలదీశారు.



# లాలూ కూటమి వస్తే మళ్లీ 'జంగిల్ రాజ్': అమిత్ షా

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభకు పంపారు, మరొకరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.ఆయన తన సతీమణిని బీహార్ ముఖ్యమంత్రిని చేశారు. ఆయన తన సంతానాన్ని మాత్రమే ప్రోత్సహిస్తారు. ఆయన సొంత కులస్థుల సంక్షేమం గురించి ఆలోచించరు' అని అమిత్ షా విమర్శించారు. కాంగ్రెస్, ఆర్‌జెడి 'ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిల కోటాల నుంచి రిజర్వేషన్‌ను హస్తగతం చేసుకుని ముస్లింలకు అటువంటి ప్రయోజనాలు చేకూర్చాయి' అని బిజెపి సీనియర్ నేత అమిత్ షా ఆరోపించారు. 'ప్రధాని నరేంద్ర మోడీజీ సారథ్యంలోని ఎన్‌డిఎ దీనిని జరగనివ్వదు. బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్, లాలూ ప్రసాద్, మమతా బెనర్జీ వ్యతిరేకం' అని అమిత్ షా అన్నారు. 'అరాహ్ లోక్‌సభ సీటు నుంచి సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) కనుక గెలిచినట్లయితే బీహార్‌కు నక్సలిజం తిరిగి వస్తుంది' అని అమిత్ షా అన్నారు. బిజెపి అభ్యర్థి ఆర్‌కె సింగ్ అరాహ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేస్తుండగా, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) 'మహాఘట్‌బంధన్' అభ్యర్థిగా సుదామ ప్రసాద్‌ను నిలబెట్టింది. నియోజకవర్గంలో జూన్ 1న వోటింగ్ జరుగుతుంది.

# తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వరు..

(మొదటి పేజీ తరువాయి)

కాదని, రియల్ ఎస్టేట్ వ్యాపారి అని దుయ్యబట్టారు. ఏ ముఖ్యమంత్రైనా రాష్ట్రం అప్పుల్లో ఉందని చెబుతారా..? దివాలా తీసిందని అంటారా..? ఇట్ల మాట్లాడితే రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమికొట్టింది కేసీఆర్ కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించి ఫ్లోరైడ్‌ను రూపుమాపారని గుర్తు చేశారు. వెయ్యేండ్లు గుర్తుండిపోయేలా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆలయాన్ని పునర్నిర్మించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం తెలంగాణలో అమలవుతున్నదని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. 420 హామీలు ఇచ్చిన హస్తం పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి దెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు. ఓ వైపు గోల్డ్ మెడలిస్ట్, మరోవైపు బ్లాక్‌మెయిలర్ ఉన్నారని, ఇటు వైపు బిట్స్ ఫిలానీ, అటు వైపు పల్లీ బఠాణీ ఉన్నారని, ఎవరు కావాలో పట్టభద్రులే నిర్ణయించుకోవాలని సూచించారు.

# 50 మంది నకిలీ డాక్టర్లు పట్టివేత



**హైదరాబాద్, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ వైద్య మండలి సభ్యులు ఐడిపిఎల్, చింతల్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 50 మంది నకిలీ వైద్యులను గుర్తించారు. ఎనిమిది మంది సభ్యులు వేర్వేరు బృందాలుగా ఒకేసారి తనిఖీలు జరిపారు. నకిలీ వైద్యులు తమ ఆరోగ్య కేంద్రాల్లో రోగులను చేర్చుకుని పెద్ద సంఖ్యలో యాంటీ బయాటిక్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. తాము వైద్యులుగా పేర్కొంటూ బోర్డు పెట్టుకోవడమే కాక, వారికి అనుసంధానంగా మెడికల్ షాపులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు కూడా పెట్టుకున్నారని అధికారులు వెల్లడించారు. దాదాపు యాభై మంది నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఇద్దరిని జైలుకు పంపినట్లు వెల్లడించారు. తనిఖీల్లో డాక్టర్ ప్రతిభాలక్ష్మి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సన్నీ డేవిస్, డాక్టర్ ఇమ్రాన్ అలీ, డాక్టర్ కే. విష్ణు, పాండు తదితరులు పాల్గొన్నారు.

# బూత్ వారీ ఓటింగ్ డేటాను వెబ్‌సైట్‌లో పెట్టడం కుదరదు: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ,మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలింగ్ జరిగిన 48 గంటల్లో ప్రతి పోలింగ్ స్టేషన్ లో ఎన్ని ఓట్లు పోలయ్యాయని బూత్ ఓటర్ల డేటాను ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అప్ లోడ్ చేయడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఎడిఆర్ ఎన్‌జివో సంస్థ పెట్టుకున్న అభ్యర్థనను తిరస్కరిం చింది. ఐదు దశల ఎన్నికలు అయిపోయినందున ఇలాంటి తా త్కాలిక ఆదేశాలు జారీచేయలేమని స్పష్టం చేసింది. న్యాయ మూర్తులు దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మా సనం ఈ తీర్పును వెలువరించింది. బూత్ డేటాను అప్ లోడ్ చేయడం వల్ల ఓటర్లు అయోమయానికి గురికావొచ్చని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. ఫారమ్ 17సి డేటాను అభ్యర్థి లేదా బూత్ ఏజెంట్‌కు మాత్రమే ఇస్తామని ఎన్నికల సంఘం తెలిపింది.



# అమరుల త్యాగాలతోనే పీడిత ప్రజల విముక్తి

**హనుమకొండ, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పీడిత ప్రజల విముక్తి కోసం అమరుల త్యాగాలు గొప్పవని, అమరుల త్యాగాల స్ఫూర్తితో పీడిత ప్రజల విముక్తి కోసం ప్రజా పోరాటాల ద్వారానే సమసమాజం స్థాపించగలమని ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, అన్నారు. హన్మకొండ జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో శుక్రవారం జరిగిన కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి 15 వ వర్ధంతిలో వారు పాల్గొని నివాళులు అర్పించి మాట్లాడారు. దేశంలో ఆధిపత్య వర్గ పాలకులు చేస్తున్న దోపిడి పాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు జరిగి వేల మంది అమరులయ్యారని వారిలో కామ్రేడ్ పటేల్ సుధాకర్ రెడ్డి త్యాగం చాలా గొప్పదని అన్నారు. సంపన్న కుటుంబంలో పుట్టి ఇంజనీరింగ్ విద్యలో బంగారు పథకం సాధించిన సుధాకర్ రెడ్డి దోపిడి పాలనకు వ్యతిరేకంగా 1981లో రాడికల్ విద్యార్థి సంఘంలో చేరి



విద్యార్థులను చైతన్యం చేశాడని అన్నారు. 1983లో అప్పటి పీపుల్స్ వార్ పార్టీలో చేరి దండకారణ్యం, ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో పేదల విముక్తి కోసం పోరాటం చేసి మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగాడని అందరు ఉద్యమకారులను చంపినట్లె కామ్రేడ్ సుధాకర్ ను 24 మే 2009 న రాజ్యం బలితీసుకున్నదని అన్నారు. కామ్రేడ్ సుధాకర్ ఆశయాల కొనసాగింపులో బాగంగా ప్రజలను చైతన్యపరిచి దోపిడి పాలనను అంతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్ రెడ్డి సహచరి పటేల్ వనజ మాట్లాడుతూ అమరుల త్యాగాల బాటలో కొనసాగి ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడమే ప్రజల ముందున్న మార్గమని, ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన పటేల్ సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో నా వంతు కృషి చేస్తానని అన్నారు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం చేస్తున్న ఉద్యమకారులకు రాజ్యానికి మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధాన్ని ఆపడానికి మేధావులు, సామాజిక కార్యకర్తలు చొరవ తీసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చాపర్తి కుమార్ గాడ్గే, సింగారపు అరుణ, సద్గుణ, బీరం రాము, వల్లాల జగన్ గౌడ్, సూరం నిరంజన్, కేడెల ప్రసాద్, ఎడ్ల అర్జున్, ధాడబోయిన రాజు, కోటేశ్వరరావు న్యాయ వాదులు జె జె స్వామి, కూనూరు రంజిత్ గౌడ్‌లు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన ఎండి ఇర్ఫాన్

**హనుమకొండ, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** గోవా ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2024 నిర్వహించిన పోటీల్లో ఎండి ఇర్ఫాన్ గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. యూనివర్సల్ 369 షోటో కాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా గోవా ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్ కరాటే పోటీలు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సినీ హీరో సుమన్ తల్వార్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీలలో నేపాల్, కువైట్ ,సౌత్ ఆఫ్రికా, జపాన్, శ్రీలంక బాంగ్లాదేశ్ ,కెనడా, ఇరాక్, ఫ్రాన్స్ ,ఇండోనేషియా, యుగాండా యూఏఈ తదితర సుమారు 16 దేశాల నుండి 3,000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు . ఈ పోటీలలో వరంగల్ బిఎంఆర్ అకాడమీ విద్యార్థి “ఎండి ఇర్ఫాన్” మిటి విభాగంలో బంగారు పతకం, వ్యక్తిగత కటా పోటీలో సిల్వర్ మెడల్ సాధించి తన సత్తా



చాటాడు. గోల్డ్ సిల్వర్ మెడల్స్ సాధించిన ఇర్ఫాన్ కు అకాడమీ ప్రెసిడెంట్ బండారి సంతోష్, కార్యదర్శి కర్ర వెంకటేష్, కుంగ్ ఫు



మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ గ్రాండ్ మాస్టర్ సదానందం, గోల్డెన్ కిడ్స్ స్కూల్ కరస్పాండెంట్ సుజాత, ప్రిన్సిపాల్ మాధవి మరియు సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను పెంచేందుకు కృషి చేయాలి

**- ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్**

**మహబూబాబాద్, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలను పెంచే అందుకు కృషి చేయాలని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మహబూబాబాద్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మహబూబాబాద్ నందు జిల్లా ఆసుపత్రి గైనకాలజిస్టు, తెలంగాణా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల సూపర్డెంట్లు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి మరియు ప్రోగ్రాం అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మహబూబాబాద్ జిల్లా లో సాధారణ ప్రసవాలను పెంచి మహబూబాబాద్ జిల్లాను రాష్ట్రం లో ఉన్నత స్థానంలో వుంచాలని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త డాక్టర్ వెంకట్ రాములు మాట్లాడుతూ క్షేత్ర స్థాయి లోని సిబ్బంది మహిళ గర్భం ధరించి నప్పటి నుండి ప్రసవం జరిగే వరకు సాధారణ ప్రసవాల కొరకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని ఆయన తెలిపారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీ విద్య మాట్లాడుతూ జనరల్ హాస్పిటల్ కు వచ్చిన గర్భిణీ స్త్రీలకు కౌన్సిలింగ్ ఇచ్చి నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నం



చేస్తున్నామని ఇకముందు కూడా తమ వంతు కృషిచేసి సాధారణ ప్రసవాలను పెంచేందుకు తోడ్పాటున అందిస్తామని తెలిపారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ బిందుశ్రీ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలను తీసుకువచ్చే ఆశా కార్యకర్తలకు ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమన్వయ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి భాయి, ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ వెంకట్ రాములు, గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్ చింతా రమేష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బిందు శ్రీ, డాక్టర్ అంబరీష, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ మురళీధర్, ప్రబుత్వ ఆసుపత్రికి గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీవిద్య అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ దీప్తి, డాక్టర్ కరుణాకర్ అసోసియేట్ ప్రొఫెసర్ పీడియాట్రిక్స్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## ఇంటర్ పరీక్ష కేంద్రాలలో మెడికల్ క్యాంప్‌ను పర్యవేక్షించిన ప్రభుత్వ వైద్య అధికారి డా.రాజ్ కుమార్ జాధవ్

**గార్ల, మే 24(పిసిడబ్ల్యూ న్యూస్):** గార్ల మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సర పరిక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే అయితే ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ వైద్య ఆరోగ్యశాఖ తరుపున ప్రతీ పరిక్ష కేంద్రాలలో ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు ,మెడికల్ క్యాంపు కి కావలసిన మందులతో పాటు వైద్య పరికరాలను ఏర్పాటుచేసినట్లు ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాధవ్ తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ గోవింద రావు గారిని కలిసి మాట్లాడుతు విద్యార్థులకు ఆరోగ్యశాఖ తరుపున ఏటువంటి సహకారం కావాలన్న తెలియజేయాలని కోరారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద,లేదా పరిక్ష రాస్తున్న సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే అందుబాటులో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ శాఖ సిబ్బందినీ సంప్రదించి చికిత్స పొందాలని తెలిపారు. విద్యార్థులందరు పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ గోవిందరావు, లెక్చరర్ అంబెద్కర్ , పోలీసు అదికారులు మంగిలాల్, భారతి ,వైద్య సిబ్బంది ఏ ఎన్ ఏం పార్వతి , ఆశా సుజాత తదితరుల పాల్గోన్నారు.



## ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కార్తీక్

**- జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అల్వాల కార్తీక్**



**హనుమకొండ ప్రతినిధి, మే 24 (పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లాలోని 11వ డివిజన్ లో వరంగల్ ఖమ్మం నల్గొండ పట్ట భద్రుల ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు మద్ద తుగా జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అల్వాల కార్తీక్ ఆధ్వ ర్యంలో శుక్రవారం విద్యార్థులను, నిరుద్యోగులను కలుస్తూ.. తీన్మార్ మల్లన్నకు మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేయాల్సిందిగా కోరుతూ.. కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. 11వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాన్నా రపు సంగీత్ 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ లక్ష్మి సురేం దర్ యువ జన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమ వినయ్ కుమార్ గోవిందు శ్వేత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మమ్మద్ సమద్ భాయ్ గన్నారపు కమల్ కుమార్ గద్దల శివప్రసాద్ గోల్కొండ సాంబయ్య ఇసం పెల్లి క్రాంతి రమేష్ పవన్ మహేష్ అభినయ్ సతీష్ తదితరు డివిజన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న గెలుపు కోరుతూ ప్రచారం



**సీరోల్, మే24(పిసిడబ్లూ న్యూస్):** ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న గెలుపు కోరుతూ సీరోలు మండలం కోత్తూరు (సి) గ్రామం లో పట్టుభద్రులను కలిసి మల్లన్న కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీరోలు, కురవి, మరిపెడ మండలాల కో ఆర్డినేటర్ కాలం రవీందర్ రెడ్డి.సీరోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండపల్లి కరుణాకర్ రెడ్డి.సీనియర్ నాయకులు కోప్పుల వెంకట్ రెడ్డి,సీరోలు మండల ఉపాధ్యక్షులు మలిశెట్టి వేణు.బుడిగె లక్ష్మయ్య గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడి ఉపేందర్ రెడ్డి,నాయకులు చిప్పరపల్లి వెంకన్న.యానాల వెంకట్ రెడ్డి చిట్యూరి లక్ష్మి నారాయణ.వీరిశెట్టి శ్రీను.చిప్పరపల్లి మల్సూరు.సూడి సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డుకు బోయిని రంజిత్ ఎంపిక..

**సుల్తానాబాద్, మే 24(పిసిడబ్ల్యూ న్యూస్):** సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డు 2024 సంవత్సరంకు గాను ఆల్ ఎంప్లాయిస్ స్టూడెంట్స్ యూనియన్ కాలేశ్వరం జోన్ ప్రెసిడెంట్ గా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మద్దికుంట గ్రామానికి చెందిన బోయిని రంజిత్ ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటీవారు ప్రకటించారు. అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ బి ఎస్ ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకపోవడం కొరకుబహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి సంవత్సరం ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం జూన్ 10వ తేదీన మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించే బహుజన రైటర్స్ 4వ వెస్టర్న్ ఇండియా కాన్ఫరెన్స్ సందర్భంగా సావిత్రిబాయి పూలే నేషనల్ అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోనే 5 రాష్ట్రాలైన మహారాష్ట్ర మధ్యప్రదేశ్ గుజరాత్ రాజస్థాన్ గోవా రాష్ట్రాల నుండి సుమారు 500 మంది ప్రతినిధులు సమావేశానికి హాజరు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఎస్ ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యం.యం గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమండ్ల విష్ణు,అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్ బి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**గంగాధర, మే 24(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన వేముల చిన్నకొమురయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించి 5వేల రూపాయాలను ఆర్థిక సహాయం అందజేసిన చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలి మలి దశ ఉద్యమకారుడు స్వర్గీయ కీర్తిశేషులు కొలిశెట్టి రాందాస్ , మరో ఉద్యమకారుడు ఎం.వర్ధాచారి వర్ధంతి సభ



**ఖమ్మం, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**ఖమ్మం మయూరి సెంటర్ అమరవీరూల స్తూపం వద్ద తొలి మలి దశ ఉద్యమకారుడు స్వర్గీయ కీర్తిశేషులు కొలిశెట్టి రాందాస్ , మరో ఉద్యమకారుడు ఎం.వర్ధాచారి ప్రధమ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమానికి బహుళ సంఖ్యలలో ఉద్యమకారులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు . ఆనాడు ఉద్యమంలో ఆయన పడ్డ కష్టాలను మరియు ఉద్యమ స్ఫూర్తిని పలుమార్లు స్మరించుకొని కొన్నియాడారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్.కాంతేశ్వర రావు , కైలాస్ నాథ్ , టి రామారావు , ఎండి జాఫర్ , సుబ్బారావు , పాలకుర్తి కృష్ణ , కృష్ణ బాబు , దిండిగల రాజేంద్ర , సతం , నర్సిరెడ్డి , రవీంద్ర , సిహెచ్ వెంకటేశ్వర్లు , గోపగాని శంకర్ , మలి దశ మహిళా ఉద్యమకారురాలు ఊర్మిళ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకు స్వాగతం పలికిన రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రాహత్ పర్వీన్

**హనుమకొండ ప్రతినిధి, మే 24 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఎమ్మెల్సీ పట్ట భద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ప్రచారంలో భాగంగా వరంగల్ తూర్పులో మండి బజార్ జెండా గద్దె వద్దకు చేరుకోగా రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రాహత్ పర్వీన్, 11వ డివిజన్ కాంటెస్ట్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి,25 వ డివిజన్ ప్రెసిడెంట్ సాజిద్ భాయ్, డిస్ట్రిక్ మైనారిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ జమీరుద్దీన్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రార్థన చేసి మైనారిటీ నాయకుల, స్థానిక ప్రజల ఆశీర్వాదం తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంధాలయ చైర్మన్ రియాజ్ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి రాహత్ పర్వీన్11వ డివిజన్ కాంటెస్ట్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి,25 వ డివిజన్ ప్రెసిడెంట్ సాజిద్ భాయ్, డిస్ట్రిక్ మైనారిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ జమీరుద్దీన్ హనుమకొండ వరంగల్ 11వ డివిజన్ ముహమ్మద్ ఖాజా పాషా గ్రేటర్ వరంగల్ సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మమ్మద్ తాహిర్ భాయ్, మహమ్మద్ అమీర్ పాషా (చోటు),కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొండా యువసేన ఫర్హాన్, ఫర్హాజ్, అద్నాన్,చోటు,సోహైల్,రషీద్ భాయ్,ఆఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.



# అవిశ్రాంత యోధుడు నల్లమల గిరిప్రసాద్ జీవితం ఆదర్శనీయం

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి**

**డోర్నకల్, మే 24(పిసిడబ్ల్యూ న్యూస్):** అవిశ్రాంత పోరాట యోధుడు,ఆదర్శాల వీరుడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటనాయకుడు నల్లమల గిరిప్రసాద్ జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయం అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. డోర్నకల్ మండల కేంద్రంల సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ మాజీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ నల్లమల్ల గిరిప్రసాద్ 27వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించి ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్వంచ ఏజెన్సీ దళ నాయకునిగా గిరిజనులను,బలహీనవర్గాలను సమీకరించి, జాగీర్దార్ల,




జమీందారుల స్వాధీనం లోని భూములను పేదలకు పంచి నిజాం పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన గొప్ప ఆదర్శ కమ్యూనిస్టు అని కొనియాడారు.నాటి యూనియన్ సాయుధ బలగాల తూటాలతో రక్తపు మడుగులలో కొట్టుమిట్టాడుతున్న దశలో గిరిజనులు కాపాడి నాటు వైద్యంతో బ్రతికించుకున్నారు ఆనాటి నుండి జైలు జీవితం గడిపి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా,రాజ్యసభ సభ్యుడిగా, జాతీయ డిప్యూటీ కార్యదర్శిగా పార్టీకి ఎనలేని సేవలు చేసి పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించి, అనేక ప్రజా ఉద్యమాలకు సారథిగా నిలిచిన గొప్ప నిబద్ధతగల కమ్యూనిస్టు నాయకుడని వారి జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయం కావాలని కోరారు. ఈ కార్యక్రమలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరి నాగేశ్వర్ రావు మండల కార్యదర్శి తురక రమేష్ కే ప్రబెష్ జన్నే స్వామి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నకు పూర్తి మద్దతు తెలిపిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక సేన కళాకారులు

**ఖమ్మం, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక సేన కళాకారుల గౌరవ సలహాదారులు రాధా కృష్ణ , జిల్లా అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావుల ఆధ్వర్యంలో సంజీవ రెడ్డి భవనంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ ఎస్.డి.ఎం హుస్సేన్ పాల్గొని మాట్లాడారు . సిపిఐ , సిపిఎం , తెలంగాణ జన సమితి , సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఇంకా ఇతర అభిమాన పార్టీలు అందరూ కలిసి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక సేన కళాకారులు పూర్తి మద్దతు తెలపడం జరిగిందని పేర్కొన్నారు . తెలంగాణ ఉద్యమంలో తీన్మార్ మల్లన్నది చురుకైన పాత్ర అని , కళాకారులు మరియు పేద ప్రజల సమస్యలే తన ఏజెండాగా ప్రశ్నించడమే ఆయుధంగా గత పది సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న వ్యక్తి తీన్మార్ మల్లన్న అని కొనియాడారు . నమ్ముకున్న సిద్ధాంతానికి ఎంత దూర




మైనా వెళ్లే వ్యక్తి . ఎన్ని ఇబ్బందులు , ఆకాంక్షలు పెట్టి పలుమారులు జైలుకు పంపిన ధైర్యంతో ఎదుర్కొని ఏక్కడ రాజీ పడకుండా ముందుకు కొనసాగిన వ్యక్తి . అలాంటి మనిషిని మనమందరం భారీ మెజార్టీతో గెలిపించి పెద్దల సభకు పంపిస్తే అందరి తరపున ప్రశ్నించే గొంతుక అవుతారని అన్నారు . ఒకసారి పట్టభద్రులందరూ ఆలోచించి తమ మొదటి ప్రాధాన్యత ఓటును తీన్మార్ మల్లన్న కు వేసి గెలిపించాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ సాంస్కృతిక సేన కళాకారుల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెంపుల సతీష్, జిల్లా గౌరవ అధ్యక్షులు నంద్యాల నాగేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పత్తి పాటి లక్ష్మి కాంత ్మ్మ, జిల్లా కోశాధికారి పెద్దపాక విజయ్ కుమార్, సహాయ కార్య దర్శి గురువయ్య,కర్ష పుల్లయ్య, మాతంగి రాందాస్‌లు పాల్గొన్నారు .

# తస్మాత్ జాగ్రత్తా....

**- నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి**

**- ఏఈఓ బాలబత్తుల శిరిణ్మయి**

**ఖమ్మం, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** నకిలీ విత్తనాలు విక్రయించేందుకు కొందరు వ్యాపారులు గ్రామాల్లోకి సైతం వస్తున్నారని అటువంటి వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం అర్బన్ ఏఈఓ బాలబత్తుల శిరిణ్మయి రైతులకు సూచించారు.ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట, ఖానాపురం హవేలీ గ్రామాలలో శుక్రవారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతుల అవసరాలను ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలతో మాటలు చెప్పి విక్రయించేందుకు వస్తున్నారని నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో



ఎవరైనా ఇంటింటికి వెళ్లి విత్తనాలు విక్రయిస్తే వారి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.గుడ్డ సంచుల్లో గాని, నకిలీ లేబుల్ తో ప్యాకెట్లను విక్రయిస్తున్నారని అలాంటి వాటి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాలలో తిరిగి విత్తనాల అమ్మే వారి దగ్గర నుంచి కొనుగోలు చేయొద్దని గుర్తింపు పొందిన, ఆదికృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు విధిగా బిల్లులను, రసీదులను తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యేంతవరకు వీటిని భద్రంగా దాచుకోవాలని సూచించారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి విత్తనాలన్నీ వారి సమాచారాన్ని వ్యవసాయ అధికారులకు అందించాలని అన్నారు. అనంతరం వేసవి దుక్కులు చేసుకోవాలని పచ్చి రొట్ట, జిలుగులు వేసుకొని కలియదున్నితే భూసారం పెరిగి పంట దిగుబడులు అధికంగా వస్తాయని రైతులకు అవగాహన కల్పించారు.

# మల్లన్న గెలుపుకోసం కాంగ్రెస్ , సిపిఎం, ఏఐఎస్ఎఫ్ విస్తృత ప్రచారం

**- ప్రశ్నించే గొంతుకతోనే పట్టభద్రులకు న్యాయం**

**గార్ల, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి ఖమ్మం,నల్గొండ, వరంగల్ పట్ట బద్రుల ఉప ఎన్నికల నేపథ్యంలో వామపక్షాలు బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ సిపిఎం, సిపిఐ,కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తి గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించిన వ్యక్తి తీన్మార్ మల్లన్న అన్నారు. అలాంటి మల్లన్నకు పట్టభద్రులు అధిక మెజార్టీతో గెలిపించానీ, రాజధానికే పరిమితమై బిజెపి అభ్యర్థికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. బాధ్యత గల పౌరుడిగా అనాది గా ప్రజల పక్షం వహిస్తూ పాలకులను నిలదీసే సత్తా ఉన్న మల్లన్నను




శాసన మండల కి పంపాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్ల కుమార్ గౌడ్, పిల్లల మరి వీరస్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుగులోత్ శ్రీను, బాదావత్ రవి, ఆడెపు వెంకటేశ్వర్లు, దీకొండ రాము, కడియం వెంకన్న, భూషణం తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ జీ ఏం, కరస్పాండెంట్ హటావో

**- సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ బచావో**

**- కోట శివశంకర్ డిమాండ్**

**కొత్తగూడెం,మే 24,(పిసిడబ్ల్యూ న్యూస్):** తనకు ఇష్టం వచ్చినట్టు ఎటువంటి పేపర్ నోటిఫికేషన్లు లేకుండా కాలేజీలలో హాస్టల్లో స్కూల్లలో పోస్టు నింపుకుంటున్న సింగరేణి ఎడ్యుకేషన్ జిఎం మరియు సింగరేణి ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ వెంటనే ఆ పోస్టుల నుంచి తొలగించాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ డిమాండ్ చేసారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి యాజ మాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుపుతున్న సింగరేణి విద్యా సంస్థలను ప్రస్తుత సింగరేణి ఎడ్యుకేషన్ జిఎం మరియు సింగరేణి ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ ఇద్దరు వాళ్ల వ్యక్తిగత స్వార్థాలకు వాళ్ల వ్యక్తిగత కక్షలకు కేరాఫ్ అడ్రస్సులుగా మార్చుకొని సింగరేణి విద్యాసంస్థల్ని వాడుకుంటున్నారని ఎటువంటి తప్పు చేయకపోయినా ఎటువంటి ఫిర్యాదులు



అందకపోయినా వ్యక్తిగతంగా కక్ష పెట్టుకొని హాస్టల్ కేర్ టేకర్ సత్యవతి మేడం ను తొలగిస్తూ వారికి కావలసిన వారినిఎటువంటి పేపర్ నోటిఫికేషన్లు లేకుండా కాలేజీ ప్రిన్సిపాల్ స్కూల్ హెచ్ఎంల కమిటీలు లేకుండా డైరెక్టుగా జరిగే ఉద్యోగ నియామకాలను వెంటనే ఆపివేయాలి. డైరెక్టర్ విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు పత్రికా ప్రకటనలో కోటా శివశంకర్ డిమాండ్ చేశారు.

# ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించాలి

**- జిల్లా వైద్య , ఆరోగ్య శాకాధికారి డాక్టర్ కళావతి బాయి**

**మహబూబాబాద్,మే24:(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది, స్టానిక గ్రామ పంచాయతీ సిబ్బంది తో కలిసి ప్రజలకు ప్రతి శుక్రవారం డ్రై డే విధానం పాటించేలా అవగాహన కలిగించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. కళావతి బాయి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ మండలం లోని మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు గ్రామాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. కళావతి బాయి సందర్శించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని, స్టానిక గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి మురుగు గుంతలను పూడ్చివేయాలని, నీరు ఎక్కువగా నిల్వవున్న కుంటలలో ఆయిల్ బాల్స్ కానీ, కిరసనాయిల్ గాని, వేయాలని కొబ్బరిబొండాలు, పాడై పోయిన టైర్లు, మొదలగువాటిని ఇంటి చుట్టూ ప్రక్కల వుంచకుండా చూడాలని అన్నారు. జ్వరం తో బాధపడుతున్న వారికి రక్తపూతలు తీయాలనీ రానున్న వర్షాకాలము లో అంటువ్యాధులు ప్రబలకుండా చూసుకోవడాని ముందస్తు ప్రణాళికలను ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి కేంద్రం పరిధిలో సి సెక్షన్ కాన్పులు ఎక్కువగా అవుతున్నట్లు గుర్తించి సి సెక్షన్ కాన్పులను తగ్గించుటకై వైద్య ఆరోగ్య సిబ్బంది తల్లుల సమావేశంలో గర్భిణీ స్త్రీలకు మరియు వారి బంధువులకు సాధారణ ప్రసవాల వలన చేకూరే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. రానున్న వర్షాకాలము సీజన్ లో సిబ్బంది అందుబాటులో వుండాలని ప్రతి గర్భిణి స్త్రీ ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం కొరకు ప్రోత్సహించాలని అన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా చూడాలని,



ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న గర్భస్రావాల పైన నిఘా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ సుధీర్ కుమార్, జిల్లా ఉప మాస్ మీడియా అధికారి కొప్పుప్రసాద్, ఎంపిహెచ్ఈఓ తోట శ్రీనివాస్, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయవంతంగా కొనసాగుతున్న యాసంగి ధాన్యం కొనుగోలు

**- అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్**

**పెద్దపల్లి జిల్లా, మే 24(పీసీడబ్ల్యూ న్యూస్):** 2023-24 సీజన్ యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పెద్దపల్లి జిల్లాలో జోరుగా కొనసాగుతున్నదని, నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు దాదాపు 92 శాతం మేర ధాన్యం కొనుగోలు పూర్తి చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో ప్రతినిత్యం పర్యవేక్షిస్తు ధాన్యం కొనుగోలు ప్రక్రియను గతం కంటే వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఈ సీజన్ లో ఇప్పటికే గత ఏడాది కంటే ఎక్కువ వడ్లను కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లాలో ఈ యాసంగి సీజన్ లో నిర్దేశిత 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంలో ఇప్పటివరకు 2 లక్షల 75 వేల 826 మెట్రిక్



టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 38 వేల 720 మంది రైతుల వద్ద నుంచి 605 కోట్ల 20 లక్షలకు పైగా విలువ గల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 35 వేల 653 మంది రైతులకు 499 కోట్ల 58 లక్షలకు పైగా ధాన్యం డబ్బులు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ధాన్యం అమ్మిన మూడు రోజులలోనే ఖచ్చితంగా రైతుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నదని, నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా టార్ఫాలిన్లను అందుబాటులో ఉంచామని, అవసరమైన మేర ప్యాడి క్లీనర్లు ఏర్పాటు చేసి ధాన్యం క్లీనింగ్ చేయడం ద్వారా తాలు పేరుతో వచ్చే కోతల సమస్యను పరిష్కరించామన్నారు. రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటూ వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేపట్టి సకాలంలో చెల్లింపులు జరుపుతున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు.

# ఉమ్మడి గోల్లచర్ల గ్రామ పంచాయితీలో విస్తృతంగా ప్రచారం

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ - తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం**

**డోర్నకల్, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** 27 తారీఖున నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఉమ్మడి వరంగల్,నల్గొండ,ఖమ్మం జిల్లాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీ కోసం ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ ఆదేశానుసారం పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక, ప్రజా సమస్యలపై పోరాడే తీన్మార్ మల్లన్న గెలుపు కోసం డోర్నకల్ నియోజకవర్గంలో డోర్నకల్ మండలము ఉమ్మడి గొల్లచర్ల గ్రామ పంచాయితీలో పరిధిలో ఉన్న 6 గ్రామ పార్టీ అధ్యక్షులు ఆద్వర్యంలో శుక్రవారం పట్టభద్రులు మీ అమూల్యమైన ఓటు వేసి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ప్రచారం నిర్వహించరు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డీఎస్ జగదీశ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పగిడిపాల అరుంధతి వెంకటేశ్వర్లు, అంగోతు వెంకన్న నాయక్,గుగులోత్ లాలు నాయక్, మాజీ ఎంపిటిసి బానోత్ శంకర్ నాయక్,కాశం శేఖర్, మాజీ ఉప సర్పంచ్ సపవట్ శ్రీనివాస్ నాయక్, మాజీ జెడ్పిటిసి గొర్ల సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ మేకపోతుల రమ్య శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బానోత్ కోబల్ నాయక్, జర్పుల బంటి,బానోత్ శ్రీనివాస్ నాయక్, బానోత్ రామా నాయక్, మాజీ సర్పంచ్ గంధంసిరి ఉపేందర్, మాజీ సర్పంచ్ అజ్మీరా లెనిన్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ గొడుగు సురేష్,సొసైటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, పకీర నాయక్,రవి నాయక్, సతీష్ నాయక్, బానోత్ కస్నా నాయక్,బొంపెల్లి శీను,







ముఖ్య నాయకులు,వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,గ్రాడ్యుయేట్ ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏనుగుల రాకేష్ రెడ్డిను భారీ మెజార్టీతో గెలిపించండి

**- బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాత గణేష్**



**బయ్యారం, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏనుగుల రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు,వైస్ ఎంపీపీ తాత గణేష్ గ్రాడ్యుయేట్ ఓటర్లు ను ఒక ప్రకటనలో కోరారు. వరంగల్,ఖమ్మం, నల్లగొండ జిల్లా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ బిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలిపించాలని నిరుద్యోగులను నిలువునా ముంచిన బిజెపి,కాంగ్రెస్ కు ఓటు అడిగే నైతిక హక్కు లేదని,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా జాబ్ క్యాలెండర్,నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగులకు డిఏ, పిఆర్సిలు, ప్రమోషన్లు, బెనిఫిట్స్, మహిళలకు 2500, కళ్యాణ లక్ష్మి ,తులం బంగారం ఇచ్చిన హామీలు ఎటుపోయా యని ప్రశ్నించారు. ఆమోద యోగ్యుడైన వ్యక్తి మన ప్రతినిధిగా ఉండాలా,బ్లాక్ మెయిలర్ ప్రతినిధిగా ఉండాలా అని ప్రతి గ్రాడ్యుయేట్ ఆలోచించి విజ్ఞతతో ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీగా గెలిపించండనిబయ్యారం మండల పట్టభద్రులకు పిలుపునిచ్చారు.

# పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు ..?



**బయ్యారం,మే 24(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని గంధం పల్లి పంచాయతీ పరిధిలో ఓ నిర్మానుశ ప్రాంతంలో కొంత మం ది శుక్రవారం పేకాట ఆడుతుండగా నమ్మదగిన సమాచారం మేరకు బయ్యారం పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమా చారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పేకాట ఆడుతున్న 9 మందిని పోలీసు సిబ్బంది అదుపులో తీసుకున్నట్లు సమా చారం. సంఘటన ప్రాంతంలో ఎంత నగదు పట్టుకున్నారో పోలీ సు అధికారుల ద్వారా సమాచారం తెలియాల్సి ఉంది. దీని పై సిఐ రవికుమార్ వివరణ కోరగా పేకాట ఆడుతున్న సమా చారం అందుకున్న మా సిబ్బంది పలువురిని అదుపులోకి తీసుకు న్న మాట వాస్థవమేనని పూర్తి వివరాలు రేపు మీడియా కు వెల్లడిస్థామని తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసేట్ - 24)

**మహబూబాబాద్ జిల్లా, మే 24, (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ లలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ కోర్సులతో పాటు, వ్యవసాయ డిప్లొమా, వెటరినరీ డిప్లొమా కోర్సు లలో ప్రవేశం కొరకు శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1-30 గంటల వరకు నిర్వహించిన పాలీసేట్ - 24 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మహబూబాబాద్ పట్టణంలో (6) పరీక్షా సెంటర్ లలో బాలురు 887, బాలికలు 722 మొత్తం 1609 మంది విద్యార్ధులకు గాను బాలురు 784, బాలికలు 645 మొత్తం 1429 మంది విద్యార్ధులు హాజరయ్యారు. ఈ పర్యవేక్షణలో సాంకేతిక విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్ డి. శోభారాణి , ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి. రాజు, ప్రత్యేక పరిశీలకులుగా ఎం. చంద్ర ప్రకాష్ ( సాంకే తిక విద్యా శాఖ ) , ఏం. శ్రీ రాములు (విద్యా శాఖ ) , యు. నర్సయ్య (రెవిన్యూ శాఖ),యాకుబ్ రెడ్డి ( పోలీస్ శాఖ )పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**మరిపెడ, మే24(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలంలోని గిరిపురం, తానంచర్ల సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మరిపెడ సబ్ డివిజన్ ఏడిఈ లోక్ నాద్ రెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెద్ద నాగరం 132 సబ్ స్టేషన్ మరమ్మతుల తోపాటు గిరిపురం,తానంచర్ల సబ్ స్టేషన్ లలో మరమ్మతులు చేపట్టనుండటంతో శనివారం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శ్రీపాల్ రెడ్డి**



**మరిపెడ,మే 24(పిసిడబ్ల్యూ న్యూస్):**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు వీసారపు శ్రీపాల్ రెడ్డి కోరారు.ఉమ్మడి ఖమ్మం-వరంగల్- నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని సాయి సందీపనీ ఓకేషనల్ కాలేజీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. నిరుద్యోగుల సమస్యల తీరాలంటే తీన్మార్ మల్లన్నను శాసనమండలికి పంపించాలని తెలిపారు. గత కెసిఆర్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన తీన్మార్ మల్లన్న ప్రజా సమస్యలపై రాజులేని పోరాటం చేశారని గుర్తు చేశారు.ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అలువాల ఉపెందర్ ప్రజాపతి, కొంపెల్లిసురేందర్ రెడ్డి,కారంపూడి ఉపేందర్, దూగుంట్లవెంకన్న,ఉప్పలయ్య,రామ చంద్రయ్య, మహేష్, కమలాకర్,వెంకన్న,కొమ్ము అనిల్, రమేష్,సంతు, కళాశాల అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషిచేయాలి

**- యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ యార అజయ్ రెడ్డి**

**చిట్యాల/మొగుళ్లపల్లి, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గ ప్రెసిడెంట్ యార అజయ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ...ఈనెల 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టభద్రులంతా కలిసి ప్రశ్నించే గొంతుకైనా మల్లన్న కి ఓటును వెయ్యాలి అని అన్నారు.. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడు మల్లన్నను గ్రాడ్యుయేట్స్ అందరూ గెలిపించాలని కోరారు.



# భూసార పరీక్షలేవీ సారూ!

**- రెండేళ్లుగా అందుబాటులో లేని ఫలితాలు**

**- సరైన సమాచారం అందక రైతుల ఇబ్బందులు**

**- నడికూడ మండలంలో కానరాని భూసార పరీక్షలు**






**నడికూడ, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** పంట భూముల్లో ఎలాంటి ఎరువుల వాడాలి. ఎంత మొత్తంలో వాడాలి.. ఏ రకం పంటలకు ఏ భూమి అనుకూలంగా ఉందో రైతులకు తెలిసినప్పుడే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. భూసారాన్ని ఖచ్చితత్వంతో పరీక్షించినప్పుడే ఎరువుల విని యోగంపై అంచనా వస్తుంది. అయితే వ్యవసాయంలో ఎంతో కీలకమైన భూసార పరీక్షలను ఆ శాఖ అధికారులు ఏళ్లుగా నిర్లక్ష్యం చేస్తోంది. కొన్ని సంవత్సరాలుగా భూసార పరీక్షలపై దృష్టి సారించకపోవడంతో రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడి పెరగడంతో పాటు భూములు నిస్సారంగా మారుతున్నాయి.

**నిలిచిన రసాయనాల సరఫరా..**

హనంకొండ జిల్లాలో నడికూడ మండల పరిదిలో12 గ్రామాల్లో 1 లక్షల ఎకరాలకు పైగా సాగుకు అనుకూలమైన భూములున్నాయి. రైతులు ఏటా వివిధ పంటలను సాగు చేస్తున్నారు. గతంలో ప్రతీ వానాకాలం సీజన్‌కు ముందే వ్యవసాయశాఖ భూసార పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించేది. విశ్లేషణ తర్వాత ఫలితాలు తెలిపేవారు. నేల స్వభావంతో పాటు సూక్ష్మజీవుల స్థాయి, ఎలాంటి పోషకాలు భూమిలో ఉన్నాయి, ఎలాంటి పంటలు సాగు చేస్తే లాభదాయకమో కూడా వివరించేవారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు ప్రతీ క్లస్టర్‌లో ఒక రైతువేదికను ఏర్పాటు చేసింది. ఆయా వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు అందు బాటులో ఉండటంతోపాటు భూసార పరీక్షలు చేయించేలా 100 చొప్పున భూసార పరీక్షల కిట్లను సైతం పంపిణీ చేసింది. సాగు భూముల్లో నమూనాలు సేకరించి భూసార పరీక్షల అనంతరం ఫలితాలను రైతులకు తెలియ జేసేవారు. అయితే ప్రారంభంలో అందించిన రసాయనాల సరఫరా నిలిచి పోవడంతో రైతువేదికల్లో భూసార పరీక్షలు పూర్తిగా నిలిచిపోయాయి.

**అవగాహన లేక పరీక్షలకు దూరం..**

భూసార పరీక్షల ప్రయోజనాలపై అవగాహన లేని రైతులు పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. స్థానికంగా అందుబాటులో లేకపోయినా ప్రతీజిల్లాలో ఒక భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉంచింది. గతంలో మాదిరిగా ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ప్రత్యేకంగా ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించకపోవడంతో ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. రైతులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి కోరితే తప్ప పరీక్షలు చేసేందుకు ముందుకు రావడం లేదు. పంటల సాగు కాలానికి ముందు తూతూ మంత్రంగా కొన్ని శాంపిల్స్ సేకరించి జిల్లా భూసార పరీక్ష కేంద్రానికి పంపించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రతీ మూడు, నాలుగు సం.లకు ఒకసారి భూసార పరీక్షలు చేయిస్తే భూమిలో పోషకాలు, లవణాలు తెలుస్తాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న భూసార పరీక్షలపై ప్రభుత్వం శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోక్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

# పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

**- సిపి అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్ ప్రతినిధి, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 27 తారీఖున నల్లగొండ, వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో (వరంగల్, హనుమకొండ, జనగామ )144 సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఓ ప్రకటనలో తెలియజేసారు.వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను ఈ నెల 27 తేది ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి, లో బహిరంగ సభలు,ర్యాలీలు నిషేధం ఉంటుందని. ఎన్నికల వేళ పోలింగ్ కేంద్రాల చుట్టూ గుమిగూడరాదని పోలింగ్ కేంద్రం నుండి 200 మీటర్ల హద్దును దాటి ఓటర్లు తప్ప ఎవ్వరు లోపలికి రాకూడదని సూచించారు.కావున కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ఇట్టి విష యం పైన దృష్టి సారించి పోలీస్ అధికారులకు,సిబ్బందికి సహ కరించాలని కోరారు.ఎవరైనా ఈ నియమ నిబంధనలను పాటించకుండా ఇబ్బందులకు గురిచేస్తే అట్టి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.



# జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారం చేయాలి

**- రాజి మార్గమే రాజా మార్గం అనే నినాదాన్ని ప్రజల్లో నింపాలి**

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు**




**భూపాలపల్లి, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):**భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూన్ ఎనిమిదవ తారీఖున నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులను పరిష్కారం చేయడానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు పోలీసు అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని పోలీసు అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జడ్జి గారు మాట్లాడుతూ ప్రజల్లో ద్వేష భావాలను తగ్గించి కేసుల్లో రాజీ మార్గాన్ని అలవాటు చేయాలని అన్నారు. రాజి మార్గమే రాజా మార్గం అని ప్రజల్లో నింపాలని, దాంతో విలువైన సమయం, డబ్బు దుర్వినియోగం కాదని అన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దవి చేసుకొని పంతాలకు పోయి కేసుల్లో ఇరికితే పొలిసు స్టేషన్లు, కోర్టులకు ఎక్కితే నష్టమే తప్ప లాభం ఉండదని జడ్జి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. రామచంద్రా రావు, జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ , డి ఎస్ పీ లు సంపత్ రావు, నారాయణ , ఎస్సై లు, సీఐలు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



# తీన్మార్ మల్లన్నని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

**- కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి జిల్లా నాయకులు**



**మరిపెడ, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి వరంగల్,ఖమ్మం,నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ,బీఆర్ఎస్ అభ్యర్థులు నాయకులు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పోటీగా ఎక్కడాలేరన్నారు.ఎంపీ ఎన్నికలలో బలరాం నాయక్ కోసం నిరంతరం పని చేశామని,ఇప్పుడు ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించటం కోసం పనిచేసి భారీ మెజార్టీ ఇస్తామన్నారు.

# ఎమ్మెల్సీ రాకేష్ రెడ్డి గెలుపుకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన బిఆర్ఎస్ నేతలు

**పరకాల, మే 24 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టబద్రుల ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపుకు మద్దతుగా పరకాల పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు, నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచుతూ.. విద్యార్థులను నిరుద్యోగులను కలుస్తూ రాకేష్ రెడ్డి గెలుపు ఆవశ్యతను వివరిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పరకాల పట్టణ మహిళా అధ్యక్షురాలు, 12వ వార్డు ఇన్చార్జి గంటా కళావతి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్ రెడ్డి, గందే వెంకన్న, బాబురావు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## శాంసన్ ఔట్.. మ్యాచ్‌ను మలుపుతిప్పిన అభిషేక్



నాకౌట్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ స్పిన్నర్ అభిషేక్ శర్మ బిగ్ వికెట్ తీశాడు. క్రీజులో పాతుకుపోతున్న సంజూ శాంసన్(10)ను వెనక్కి పంపి హైదరాబాద్‌కు బ్రేకిచ్చాడు. అభిషేక్ ఓవర్లో భారీ షాట్ ఆడిన శాంసన్ బౌండరీ వద్ద మర్క్‌రమ్ చేతికి దొరికాడు.అంతే.. 67 రన్స్ వద్ద రాజస్థాన్ మూడో వికెట్ పడింది. ప్రస్తుతం రియన్ పరాగ్(5), ధ్రువ్ జురెల్(3)లు కీలక భాగస్వామ్యం నెలకొల్పే పనిలో ఉన్నారు. ఈ జోడీని విడదీస్తే మ్యాచ్ సన్‌రైజర్స్ వైపు తిరిగినట్టే. 10 ఓవర్లకు రాజస్థాన్ స్కోర్.. 71/3. ఇంకా విజయానికి 103 రన్స్ కావాలి.

## సిట్రోన్ ఇండియా ప్రచారకర్తగా ఎంఎస్ ధోనీ..!





ప్రముఖ ఫ్రాన్స్ కార్ల తయారీ సంస్థ సిట్రోన్.. భారత్ క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీని తమ ప్రచారకర్తగా నియమించుకున్నది. భారత్‌లో తమ బ్రాండ్ ప్రచారకర్తగా ఎంఎస్ ధోనీ ఉంటారని శుక్రవారం ప్రకటించింది. తమ సంస్థ ప్రచారకర్తగా ఎంఎస్ ధోనీ త్వరలో ప్రచారాన్ని ప్రారంభిస్తారని ఓ ప్రకటనలో తెలిపింది.'భారత్‌లోని ఉత్తమ క్రికెటర్లలో ఒకరైన మహేంద్ర సింగ్‌తో మా అనుబంధం దేశీయ మార్కెట్లో సుదీర్ఘ కాల ప్రయాణానికి ఉన్న నిబద్ధత అని మేం విశ్వసిస్తున్నాం. ఆయన వినయం, అంకిత భావం, శ్రేష్ఠత మా బ్రాండ్ ఆలోచనలకు పరిపూర్ణంగా సరిపోతాయి. ఎంఎస్ ధోనీతో మా అనుబంధంతో సుస్థిరంగా భవిష్యత్ మొబిలిటీ బలోపేతానికి దోహదం చేస్తుంది' అని సిట్రోన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ శిశిర్ మిశ్రా పేర్కొన్నారు.'సిట్రోన్‌తో నా అనుబంధం ఎలక్ట్రిక్ మొబిలిటీకి సుస్థిర పరిష్కారాలు చూపుతుంది. కస్టమర్ల ఆకాంక్షలకు అనుగుణంగా అర్థవంతమైన ఆవిష్కరణలతో ముందుకెళ్లేందుకు ఉపకరిస్తుంది' అని ఎంఎస్ ధోనీ వ్యాఖ్యానించాడు.

## పాక్ జట్టులో ఆ ఇద్దరూ.. జాక్‌పాట్ కొట్టిన ఐదుగురు కుర్రాళ్లు



టీ20 వరల్డ్ కప్ టోర్నీకి మరో ఏడు రోజులే ఉంది. ఇప్పటికే అన్ని జట్లు తుది బృందాలను ప్రకటించేశాయి. ఎట్టకేలకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సైతం టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌ను అనౌన్స్ చేసింది. బాబర్ ఆజాంకెప్టెన్‌గా 15 మందితో స్క్వాడ్‌ను శుక్రవారం అధికారికంగా వెల్లడించింది.'సీనియర్లు ఇమద్ వసీం, మహ్మద్ అమిర్‌లకు తుది బృందంలో చోటుదక్కగా.. ఐదుగురు కుర్రాళ్లు జాక్‌పాట్ కొట్టారు. అబ్రార్ అహ్మద్, మహ్మద్ అబ్బాస్ అఫ్రిది, సయీం అయుబ్, ఉస్మాన్ ఖాన్, అజాం ఖాన్‌లకు ఇదే తొలి వరల్డ్ కప్.

## కెప్టెన్‌కు తొలి వికెట్.. రెచ్చిపోతున్న యశస్వీ



సన్‌రైజర్స్ నిర్దేశించిన స్వల్ప ఛేదనలో రాజస్థాన్ ర్యాల్స్ బ్యాటర్లు దంచుతున్నారు. 24 వద్ద తొలి వికెట్ పడినా .. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(33) జోరు తగ్గించలేదు. భువనేశ్వర్ వేసిన ఆరో ఓవర్లో రెచ్చిపోయాడు. తన బ్యాట్ పవర్ చూపిస్తూ సిక్సర్, ఫోర్, ఫోర్, ఫోర్ బాదాడు. దాంతో, 6 ఓవర్లకు రాజస్థాన్ వికెట్ నష్టానికి 51 పరుగులు చేసింది.'హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తొలి బ్రేక్ ఇచ్చాడు. ఓపెనర్ టామ్ కొహ్లెర్ కాడ్‌మొరె(10)ను పెవిలియన్ పంపాడు. దాంతో, 24 వద్ద రాజస్థాన్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన సారథి సంజూ శాంసన్(6) దూకుడుగా ఆడుతున్నాడు.

# ఫైనల్‌కు చేరిన సన్‌రైజర్స్ హైదరాబాద్

ఐపిఎల్ సీజన్17లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫైనల్‌కు చేరుకుంది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్2లో హైదరాబాద్ 36 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆదివారం జరిగే తుది పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో హైదరాబాద్ తలపడుతుంది. ఇంతకుముదు కోల్‌కతాతో జరిగిన మొదటి క్వాలిఫయర్‌లో సన్‌రైజర్స్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. తర్వాత లక్షఛేదనకు దిగిన రాజస్థాన్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 139 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది.ఊరిస్తున్న లక్షంతో బ్యాటింగ్ చేపట్టిన రాజస్థాన్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో హైదరాబాద్ బౌలర్లు సఫలమయ్యారు. ఆరంభం నుంచే సన్‌రైజర్స్



బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేశారు. దీంతో రాజస్థాన్ బ్యాటర్లు వేగంగా బ్యాట్‌ను ఝులిపించలేక పోయారు. ఓపెనర్ కాడ్‌మోర్ (10), కెప్టెన్ శాంసన్ (10), రియాన్ పరాగ్ (6), రవిచంద్రన్ అశ్విన్ (0) విఫలమయ్యారు. మరోవైపు యశస్వి జైస్వాల్ (42), ధ్రువ్ జురెల్ (56) నాటౌట్ ఒంటరి పోరాటం చేసిన ఫలితం లేకుండా పోయింది. సన్‌రైజర్స్ బౌలర్లలో షాబాజ్ అహ్మద్ మూడు, అభిషేక్ శర్మ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్‌ను క్లాసెన్ (50), ట్రావిస్ హెడ్ (34) ఆదుకున్నారు.

## 'అభిమానులు థ్యాంక్యూ'.. కోహ్లీ పోస్ట్ వైరల్

ఐపీఎల్ పదిహేడో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పోరాటం ముగియడంతో ఆటగాళ్లతో పాటు ఫ్యాన్స్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ ఏడాదైనా కప్పు కొట్టాలనుకున్న బెంగళూరు ఆశలు ఎలమినేటర్ మ్యాచ్‌లో ఓటమితో ఆవిరయ్యాయి. ఆ జట్టు మాజీ సారథి విరాట్ కోహ్లీ తాజాగా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు.'అభిమానులందరికీ మరోసారి థ్యాంక్యూ. మమ్మల్ని ఎంతో ప్రేమిస్తున్నందుకు. ఎల్లవేళలా ప్రోత్సహిస్తున్నందుకు మీకు కృతజ్ఞతలు' అని కోహ్లీ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. ఆ పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. పదిహేడో సీజన్‌లో ఒక సెంచరీ, 5 అర్ధ శతకాలతో చెలరేగిన కోహ్లీ.. ఆరెంజ్ క్యాప్ రేసులో నిలిచాడు. 15 మ్యాచుల్లో విరాట్ 61.75 సగటుతో 741 రన్స్ బాదాడు.



## పొట్టి క్రికెట్‌లో సంచలనం.. బంగ్లాకు షాకిచ్చిన అమెరికా



సంచలనాలకు కేరాఫ్ అయిన పొట్టి క్రికెట్‌లో పసికూన అమెరికా జట్టు చరిత్ర సృష్టించింది. తొలి టీ20 సిరీస్ గెలుపొందింది. అలాగని ఏదో అనామక జట్టుపై గెలిచిందనుకుంటే పొరపడ్డట్టే. అవును.. అంతర్జాతీయ క్రికెట్‌లో మేటి జట్లలో ఒకటైన బంగ్లాదేశ్‌పై సిరీస్ విజయంతో పొట్టి ప్రపంచ కప్ ముందు కొండంత ఆత్మవిశ్వాసాన్ని పోగేసుకుంది.సొంతగడ్డపై జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో అమెరికా అద్భుత విజయంతో ఆశ్చర్యపరిచింది. ఆ విజయం గాలివాటం కాదని నిరూపిస్తూ హౌస్టన్ వేదికగా బంగ్లాదేశ్‌ను మరోసారి చిత్తుగా ఓడించి టీ20 సిరీస్ కైవసం చేసుకుంది.

## క్రికెట్ ఆడిన బామ్మ.. రికార్డులు బద్ధలు కొట్టేసిందిగా..!

క్రికెట్‌ను ఇష్టపడని వారెవరుంటారు. పసిపిల్లల నుంచి పాతికేళ్ల కుర్రాళ్ల వరకు బ్యాటు పట్టి మురిసిపోతుంటారు. క్రికెట్ సంబురం కుర్రాళ్లు, అమ్మాయిలకేనా? అని అనుకుందేమో. లండన్‌కు చెందిన 66 ఏండ్ల సల్లీ బార్టన్ పెద్ద సాహసం చేసింది. ముగ్గురు మనువరాళ్లు కలిగిన ఆమె క్రికెట్‌లో అరంగేట్రం చేసి అందర్నీ ఔరా అనిపించింది. తద్వారా అతి పెద్ద వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మహిళగా బార్టన్ రికార్డు నెలకొల్పింది.మే నెలలో బార్టన్ గిబ్రాల్టర్ జట్టు తరపున బార్టన్ ఎస్టోనియాతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆడింది. అప్పుడు బార్టన్ వయసు 66



ఏండ్ల 334 రోజులు. పోర్చుగల్‌కు చెందిన అక్బర్ సయ్యద్ పేరిట ఉన్న రికార్డును బద్ధలు కొట్టింది. అక్బర్ 66 ఏండ్ల 12 రోజుల వయసులో క్రికెట్‌లో అరంగేట్రం చేసి 2012లో రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

## వరల్డ్ కప్‌లో కార్తిక్.. మెగా టోర్నీ కామెంటేటర్స్ వీళ్లే

టీ20 వరల్డ్ కప్ కోసం అంతర్జాతీయ క్రికెకట్ కౌన్సిల్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.బ్రాండ్ అంబాసిడర్లు ప్రమోషన్ పనుల్లో బిజీగా ఉండగా.. తాజగా ఐసీసీ ఎలైట్ కామెంటరీ ప్యానెల్‌ను ప్రకటించింది. అందులో ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన ఆర్సీబీ మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్‌కు చోటు దక్కింది.ఓవైపు స్టార్ స్పోర్ట్స్ కామెంటేటర్‌గా కొనసాగుతూనే కార్తిక్ ఐపీఎలోనూ ఫినిషర్‌గా మెరపులు మెరిపించాడు. అయితే.. ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో బెంగళూరు ఓటమి అనంతరం కార్తిక్ తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌కు మంగళం పాడిన విషయం తెలిసిందే.



# రికీ, లాంగర్ వాదనలను కొట్టిపారేసిన జే షా

**న్యూఢిల్లీ:** భారత జట్టు చీఫ్ కోచ్ బాధ్యతలు చేపట్టాలంటూ ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్లను ఓ బీసీసీఐ అధికారి ఆశ్రయించినట్లు వచ్చిన వార్తలను జే షా ఖండించారు. ఈ అంశంపై బీసీసీఐ కార్యదర్శి జే షా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుత కోచ్ రాహుల్ ద్రావిడ్‌కు వారసుడిగా భారతీయుడే ఎంపిక అవుతారని ఆయన పేరన్కొన్నారు. దేశంలో క్రికెట్‌పై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తే ఆ బాధ్యతలు చేపట్టనున్నట్లు షా తెలిపారు. రాహుల్ ద్రావిడ్ కోచింగ్ బాధ్యతలు టీ20 వరల్డ్‌కప్‌తో ముగియనున్నాయి. అయితే ఆ పాత్రలో కొనసాగేందుకు ఆయన ఆసక్తిగా లేరు. నేను కానీ, లేక ఇతర బీసీసీఐ అధికారి కానీ .. ఆస్ట్రేలియా క్రికెటర్లను ఆశ్రయించలేదని, మీడియాల్లో వస్తున్న వార్తలు నిరాధారమైనవని షా తెలిపారు. ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు చేపడుతున్న ఆసీస్ మాజీ క్రికెటర్లు రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్‌లు .. భారత హెడ్‌కోచ్ రేసులో ఉన్నట్లు తెలిసింది. ఓ బీసీసీఐ అధికారి దీని గురించి తనను అప్రోచ్ అయినట్లు కూడా రికీ పాంటింగ్ ఓ మీడియాకు తెలిపారు. ఈ నేపథ్యంలోనే జే షా ఆ అంశంపై



ప్రకటన చేశారు.





## మీరు సింగిలా..? అభిమాని ప్రశ్నకు శృతిహాసన్ రియాక్షన్ ఇదే

చెన్నై సోయగం శృతిహాసన్ తన ప్రేమబంధానికి గుడ్‌బై చెప్పింది. డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారికాతో ఈ భామ గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వీరిద్దరు విడిపోయారని ముంబయి మీడియాలో ప్రచారం జరుగుతున్నది. తాజాగా తన బ్రేకప్ న్యూస్‌ను అభిమానులతో జరిపిన ఇన్‌స్టాగ్రామ్ చిట్‌చాట్ ద్వారా వెల్లడించింది. 'మీరు సింగిలా? లేదా ఎవరితోనైనా ప్రేమలో ఉన్నారా? అని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు 'నేను సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు సమాధానమివ్వను. కానీ సమయం వచ్చింది కాబట్టి చెబుతున్నా.నేను ఇప్పుడు సింగిల్‌గా నా జీవితాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్నా. ఇంతకు మించి ఇంకేం చెప్పను' అని సమాధానమిచ్చింది. దీంతో తన బ్రేకప్‌ను శృతిహాసన్ అధికారికంగా కన్‌ఫర్మ్ చేసినట్లయిందని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. కోవిడ్ సమయంలో శంతను హజారికాతో శృతిహాసన్ డేటింగ్‌ను మొదలుపెట్టింది. ఈ జంట ముంబయిలో ఒకే ఫ్లాట్‌లో సహజీవనం చేశారు.ఇద్దరు కలిసి చేసిన ఫన్నీ వీడియోలను తరచుగా సోషల్‌మీడియా ద్వారా పంచుకునేవారు. నెలక్రితం వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో అయ్యారు. దాంతో ముంబయి మీడియాలో బ్రేకప్ వార్తలొచ్చాయి. శృతిహాసన్ తాజా చిట్‌చాట్‌తో అది నిజమని తేలిపోయింది. ప్రస్తుతం శృతిహాసన్ తెలుగులో 'సలార్-2' చిత్రంలో నటిస్తున్నది.

## ఉత్తమ నటీనటులతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తున్న సంయుక్త

ఇప్పుడు బాలీవుడ్ లో దక్షిణాదివారిదే పైచేయిగా కనిపిస్తోంది. ఒక పక్క దక్షిణాదికి చెందిన దర్శకులతో పని చెయ్యాలని బాలీవుడ్ అగ్రనటులు ఆసక్తి చూపిస్తుంటే, ఇంకోపక్క దక్షిణాదికి చెందిన నటీమణులు కూడా బాలీవుడ్ లో అడుగుపెట్టి విజయం సాధిస్తున్నారు. నయనతార, రష్మిక మందన్న లు షా రుఖ్ ఖాన్, రణబీర్ కపూర్ ల సరసన నటించి విజయం సాధించి మంచి పేరు తెచ్చుకున్నారు. వీరికి అక్కడ ఇప్పుడు డిమాండ్ బాగావుంది. ఇప్పుడు వీరి అడుగుజాడల్లోనే దక్షిణాదికి చెందిన ఇంకో నటీమణి సంయుక్త బాలీవుడ్ లో అడుగుపెట్టింది.సంయుక్త ఒక మంచి కంటెంట్ వున్న సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. ఆమె చేస్తున్న సినిమాలో అగ్రనటులు లేకపోయినా అత్యుత్తమ నటీనటులు అంటే జాతీయ పురస్కారాలు అందుకున్న నటీనటులతో పనిచేస్తోంది. కాజోల్, ప్రభుదేవా, నసీరుద్దీన్ షా కీలకమైన పాత్రలో నటిస్తున్న ఒక చిత్రంలో సంయుక్త కూడా ఒక ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ సినిమాకి తెలుగు నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా టీజర్ కూడా విడుదల అవుతుందని తెలుస్తోంది.తెలుగులో వరుస విజయాలతో అగ్ర నటీమణుల్లో ఒకరుగా ఎదిగిన సంయుక్త ప్రస్తుతం ఈ హిందీ సినిమాతో ఆరంగేట్రం చెయ్యడం ఆసక్తికరంగా వుంది. ఆమె ఇప్పుడు నిఖిల్ సరసన ఒక పాన్ ఇండియా సినిమా 'స్వయంభు' చేస్తున్న సంగతి తెలిసిందే. అలాగే శర్వానంద్ తో ఒక సినిమా చేస్తున్నట్టుగా తెలిసింది.ఈ సినిమాలో ఇంకో ఆసక్తికరం అంశం ఏంటంటే ప్రభుదేవ, కాజోల్ ఈ ఇద్దరూ 27 ఏళ్ల తరువాత ఈ చిత్రంలో కలిసి నటించడం. వీరిద్దరూ ఇంతకు ముందు 'మెరుపు కళలు' అనే సినిమా చేశారు, ఇందులో ప్రభుదేవ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో కనపడతారు. రాజీవ్ మీనన్ ఆ సినిమాకి దర్శకుడు, ఆ సినిమాలో పాటలు అన్నీ అప్పట్లో పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడు వారిద్దరూ ఈ చరణ్ తేజ్ దర్శకత్వంలో వస్తున్న సినిమాలో నటించడం ఆసక్తికరం. వీరితో పాటు సంయుక్త కూడా ఒక భాగం అవటం ఆమె హిందీ ఆరంగేట్రం మంచి కలయికలో వస్తోంది అని అంటున్నారు. ఈ సినిమాకి మంచి పేరున్న సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు.

## రజనీకాంత్‌కు దుబాయ్ గోల్డెన్ వీసా!



**అబూ ధాబీ:** సూపర్ స్టార్ రజనీకాంత్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) గోల్డెన్ వీసా ఇచ్చింది. ఈ విషయాన్ని రజనీకాంత్ స్వయంగా సోషల్ మీడియాలో తెలిపారు. తనకు ఈ గౌరవాన్ని అందించిన యూఏఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.వివిధ దేశాల, వివిధ రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి 10 ఏళ్ల కాలపరిమితితో ఈ ప్రత్యేక వీసాను యూఏఈ అందిస్తుంది. 2019 నుంచి ఈ గోల్డెన్ వీసా అందిస్తోంది. ఈ రకం వీసాలు అందుకున్న వారిలో షారూఖ్ ఖాన్, సంజయ్ దత్, అల్లు అర్జున్, త్రిష, అమలాపాల్, మోహన్ లాల్, మమ్ముట్టి, టివినో థామస్, దుల్కర్ సల్మాన్, ఉపాసన ఉన్నారు. ఈ జాబితాలో ఇప్పుడు రజనీకాంత్ కూడా చేరారు.

## చిత్రపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరెస్ట్.. వెలుగులోకి సంచలన విషయాలు

చిత్రపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ అరెస్ట్‌తో ఎప్పుడూ వార్తలలో ఉండే చిత్రపురి కాలనీ మరో సారి హైలెట్ అవుతోంది. ఆయన అరెస్ట్ అనంతరం సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చిత్రపురి కాలనీలోని ప్లాట్ల కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, డబ్బులు చెల్లించిన కమిటీ సభ్యులకు ప్లాట్లను కేటాయించకుండా.. కేటాయించిన వారికి రద్దు చేసి మరొకరికి ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లుగా తమ దృష్టికి వచ్చిన పోలీసులు చెబుతున్నారు. మణికొండ చిత్రపురికాలనీలోని ప్లాట్ల కేటాయింపు కోసం కమిటీ సభ్యులుగా పరుచూరి వెంకటేశ్వరరావు, వినోద్ బాల, చంద్రమధు, కాదంబరి కిరణ్, మహానందరెడ్డిలతో పాటు చనిపోయిన సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమర వెంకటేష్ వంటి వారున్నారు.మాదాపూర్‌కు చెందిన తోట శ్రీపద్మ రూ.12 లక్షలు చెల్లించింది. తనకు అలాట్ చేసిన ఆర్‌హెచ్ 24ను మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని మార్చి 7వ తేదిన రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్లాట్ కోసం యనమల మాధవ్ రూ. 4లక్షలు చెల్లించగా.. డబ్బులు చెల్లించిన తర్వాత ప్లాట్ అలాట్‌మెంట్‌ను కమిటీ సభ్యులు రద్దు చేశారని, తాను చెల్లించిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని మార్చి 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా ప్లాట్ల కోసం డబ్బులు చెల్లించి, అలాట్‌మెంట్ రద్దైన బాధితుల సంఖ్య 150 వరకు ఉంటుందని, ఒక్కొక్కరి వద్ద నుండి రూ. 4 లక్ష నుండి 40 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. పరుచూరి వెంకటేశ్వరరావు, వినోద్ బాల, చంద్రమధు, కాదంబరి కిరణ్, మహానందరెడ్డిలతో పాటు చనిపోయిన సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమర వెంకటేష్‌తో పాటు మరికొందరిపై 420, 120బి, 506 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రపురి కాలనీ ప్లాట్ అలాట్‌మెంట్ల కుంభకోణంలో అధికారుల పాత్రపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉంటే..ఈ అక్రమ రిజిస్ట్రేషన్లపై ఎంక్వైరీ వేస్తే వేల కోట్ల కుంభకోణంబయటపడుతుందని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు.



## రాజస్థాన్‌లో 'టైసన్ నాయుడు' కీలక షెడ్యూల్

ప్రామెసింగ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా.. సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'టైసన్ నాయుడు' . 14 రీల్స్ ప్లస్ నిర్మిస్తోన్న ఈ చిత్రం నుంచి ఆ మధ్య బెల్లంకొండ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా రివీల్ చేసిన టైటిల్ గ్లింప్స్ మంచి స్పందనను రాబట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ కీలక అప్డేట్‌ని మేకర్స్ ఇచ్చారు. పేరు మార్చిన హేమ, అసలు పేరేంటో తెలిస్తే షాకవుతారు!ఈ సినిమాకు కీలకమైన 2 వారాల షెడ్యూల్‌ను రాజస్థాన్ లో ప్రారంభించినట్లుగా మేకర్స్ అధికారికంగా తెలియజేశారు. స్టన్ శివ పర్యవేక్షణలో రాజస్థాన్ కోటలలో పది రాత్రులు సినిమాకు సంబంధించిన బ్రెత్ టేకింగ్ యాక్షన్ బ్లాక్‌ను టీమ్ షూట్ చేస్తోంది. ఇది సినిమాలో మెయిన్ హైలైట్‌లలో ఒకటని.. ఈ 2 వారాల లెన్తీ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్ కూడా షూట్ చేయనున్నామని మేకర్స్ తెలిపారు. ఈ సబ్జెక్ట్‌పై టీమ్ సూపర్ కాన్ఫిడెంట్‌గా ఉండటంతో రాజీపడకుండా సినిమాను రూపొందిస్తున్నామని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట పేర్కొన్నారు. ఈ అప్డేట్‌తోపాటుఓపవర్ ఫుల్ పిక్‌ని కూడా మేకర్స్ వదిలారు.

